సాక్షి
నిజామాబాద్

మంగళవారం । 11 । జూలై । 2023



మ్యుటేషన్ తిప్పలు

నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో ఇంటి నంబర్ల కేటాయింపులో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

- 8లో ▸



ప్రజావాణికి 215 ఫిర్యాదులు

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 215 ఫిర్యాదులు వచ్చాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.4 /26.5

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలోని పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

నిజామాబాద్ సిటీ: వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికున్ గున్యా, మెదడు వాపు వ్యాధులపై ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ సమావేశ హాల్‌లో జిల్లా కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, మున్సిపల్ కమిషనర్, పీడీ ఐసీడీఎస్, వివిధ శాఖల ఉన్నత ఉద్యోగులకు సూచించారు. నగరం, పట్టణాల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బందితో కలిసి ప్రత్యేక సానిటేషన్ కమిటీ ని ఏర్పాటు చేయాలన్నారు. డీఎంహెచ్‌వో సుదర్శనం మాట్లాడుతూ వచ్చే డిసెంబర్ వ రకు వ్యాధులు విస్తృతంగా ప్రబలే అవకాశం ఉందని, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, వ్యాధికి ముందు తర్వాత పకడ్బందీ నివారణ చర్యలు చేపట్టాలని నిర్దేశించా రు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారం రాథోడ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ నులి పురుగుల దినోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్ సిటీ: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 20న నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆవిష్కరించారు. కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో నులి పురుగుల దినోత్సవంపై ప్రత్యేక సమావేశం జరిగింది. 19 ఏళ్లలోపు వయస్సు గల వారికి ఆల్‌బెండజోల్ మాత్రలను అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుదర్శనం, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వంశీ హోటల్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు

- పేకాటలో రూ.5.20 లక్షలు స్వాధీనం



ఖలీల్‌వాడి: నగరంలోని 4వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వంశీ హోటల్‌లో సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో పేకాడుతున్న మొత్తం 22 మందిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్ తెలిపారు. అలాగే వీరి వద్ద నుంచి రూ. 5.20 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాత్రి వంశీ హోటల్‌లోని రూంనంబర్ 401/ఏ, 401/బిలలో కొందరు పేకాడుతుండగా టాస్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. ఒక రూంలో పేకాడుతున్న వారి వద్ద నుంచి మూడు బైక్‌లు, 9 సెల్‌ఫోన్లు, రూ. 4.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే మరో రూంలో నుంచి రూ. 69వేలు, 13 సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీరిని నాల్గో టౌన్ ఎస్సై సందీప్‌కు అప్పగించారు.

జిల్లాలో 16 మంది చిన్నారులకు విముక్తి

ఖలీల్‌వాడి: ఆపరేషన్ ముస్కాన్–9లో భాగంగా నిజామాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 16 మంది చిన్నారులను గుర్తించారు. జిల్లాలో జూలై 1 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 18 ఏళ్లలోపు తప్పిపోయిన, వదిలివేసిన వారితో పాటు బాల కార్మికులను గుర్తిస్తున్నారు. ప్రతి డివిజన్ పరిధిలో ఎస్సై, నలుగురు సిబ్బందిని నియమించారు. కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో 16 మంది చిన్నారుల జాడను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. పోలీసులతో పాటు మహిళా, శిశు సంక్షేమం, ఆరోగ్య, వైద్య, కార్మిక, రెవెన్యూ శాఖల నుంచి అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సోదాలు చేస్తున్నారు.


వై కేటగిరి భద్రత

ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు సెక్యూరిటీ కల్పించిన కేంద్ర ప్రభుత్వం



- ఇంటి వద్ద ఐదుగురు, కాన్వాయ్‌లో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ కమాండోలు
- ఇటీవల ఈటల రాజేందర్‌కు 'వై ప్లస్'.. ఇప్పుడు అర్వింద్‌కు 'వై'
- బీఆర్‌ఎస్ వాళ్లు దాడులకు దిగితే బుల్లెట్లు దిగుతాయ్ : ఎంపీ అర్వింద్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు కేంద్ర ప్రభుత్వం 'వై' కేటగిరి భద్రత కల్పించింది. దీంతో ఇక నుంచి అర్వింద్ కాన్వాయ్‌లో ముగ్గురు, ఇంటి వద్ద ఐదుగురు సీఆర్‌పీఎఫ్ కమాండోలు భద్రతా వలయంగా ఉండనున్నారు. మొత్తం 8 మంది కమాండోలు ఎంపీకి నిరంతరం రక్షణగా ఉండనున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో వరుసగా చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో కేంద్రం ఈ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. ఇటీవల బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌కు కేంద్ర ప్రభుత్వం 'వై ప్లస్' కేటగిరి భద్రత కల్పించింది. తర్వాత కేంద్రం తాజాగా ఎంపీ అర్వింద్‌కు భద్రత కల్పించడం ప్రాధాన్యత సంతరించుకుంది.



ఎంపీ పర్యటన వివరాలన్నీ కేంద్రానికి, రాష్ట్ర డీజీపీకి..

ఎంపీ అర్వింద్‌కు 'వై' కేటగిరి భద్రత నేపథ్యంలో ఆయన దేశంలో ఎక్కడ పర్యటించినా అందుకు సంబంధించిన ప్రతి అంశాన్ని కేంద్ర హోంశాఖ కు పంపాల్సి ఉంటుంది. అక్కడి నుంచి రాష్ట్ర డీ జీపీకి పర్యటన వివరాలు అందుతాయి. దీంతో ఎంపీ పర్యటన సందర్భంగా భద్రత కల్పించే వ్యవహారాలను డీజీపీ నేరుగా పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఎంపీ పర్యటన నేపథ్యంలో చిన్న ఘటన చోటుచేసుకున్నా సంబంధిత జిల్లా, క్షేత్రస్థాయి అధికారులపై డీజీపీ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

గతంలో ఎంపీ పర్యటన నేపథ్యంలో ఘర్షణలు

ఎంపీ అర్వింద్ తాను ప్రాతినిథ్యం వహిస్తున్న నిజామాబాద్ ఎంపీ నియోజకవర్గ పరిధిలో పర్యటించిన సందర్భంగా వరుసగా మూడు సార్లు బీజేపీ, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఇరుపార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు, పోలీసు సిబ్బంది తీవ్ర గాయాలపాలయ్యారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇతర అంశాలపై బీజేపీ ఆందోళనలు చేస్తే, ప్రతిగా టీఆర్‌ఎస్ శ్రేణులు పసుపు బోర్డు విషయంలో ఆందోళనలు చేస్తూ ఎంపీ అర్వింద్‌ను అడ్డుకుంటూ వచ్చాయి. గతేడాది ఎంపీ అర్వింద్ పలుచోట్ల పర్యటనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు, మరికొన్ని చోట్ల ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాలు ఆవిష్కరించేందుకు వచ్చిన సందర్భంలో టీఆర్‌ఎస్, బీజేపీ శ్రేణుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. వరుసగా ఇందల్వాయి మండలం గన్నారం, ధర్పల్లి మండల కేంద్రంలో, భీమ్‌గల్ మండలం బాబాపూర్‌లో ఉపాధ్యాయురాలు మరణించిన సందర్భంలో, ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి ప్రాంతంలో ఎంపీ అర్వింద్ పర్యటన నేపథ్యంలో రెండు పార్టీల మధ్య ఘర్షణలు చోటుచేసుకుని ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు గాయపడ్డారు. ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి పర్యటన నేపథ్యంలో చోటుచేసుకున్న ఘర్షణలో పలువురు గాయపడ్డారు. ఎంపీ కారు అద్దాలు సైతం బీఆర్‌ఎస్ శ్రేణులు పగులగొట్టాయి. ఈ విషయంలో పోలీసులు టీఆర్‌ఎస్‌కు సహకరించి తన భద్రతను గాలికొదిలేశారని అర్వింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌పై పార్లమెంట్ ప్రివిలేజ్ కమిటీకి ఎంపీ ఫిర్యాదు చేశారు. తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిశారు. అధికారికంగా హోంశాఖ నుంచి భద్రత కల్పించే విషయంలో ఆలస్యమయ్యే నేపథ్యంలో అమిత్‌షా కార్యాలయం సూచనల మేరకు ఎంపీ వీఆర్‌ఎస్ తీసుకున్న బ్లాక్‌క్యాట్ కమెండో, బీఎస్‌ఎఫ్ జవాన్‌లతో పాటు నలుగురు మార్షల్స్‌ను తన భద్రత కోసం నియమించుకున్నారు. అలాగే ఒక కిలోమీటర్ రేడియస్‌లో పనిచేసే విధంగా 5 వాకీటాకీలు, మూడు ప్రత్యేక వాహనాలు, అడ్వాన్స్‌డ్ వెపన్స్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇక ప్రస్తుతం ఎన్నికలు రానున్న నేపథ్యంలో 'వై' కేటగిరి భద్రత కల్పించడం గమనార్హం. ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ వాళ్లు దాడులకు దిగితే తూటాలు దిగడం ఖాయమని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు.



నిధుల మళ్లింపు..

- రాష్ట్రంలోని 70 మార్కెట్ కమిటీల నుంచి ఒకే మార్కెట్‌కు రూ. 350 కోట్లు
- కోహెడ వద్ద నిర్మిస్తున్న అంతర్జాతీయ స్థాయి మార్కెట్‌కు రుణప్రాతిపదికన కేటాయింపు
- ఉమ్మడి జిల్లా నుంచి రూ. 32కోట్లు
- వివిధ మార్కెట్లలో పెండింగ్‌లోనే అభివృద్ధి ప్రతిపాదనలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: హైదరాబాద్ నగర సమీపంలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ వద్ద నిర్మిస్తున్న అంతర్జాతీయ స్థాయి పండ్ల మార్కెట్‌కు రాష్ట్రంలోని 27 జిల్లాలకు చెందిన 70 వ్యవసాయ మార్కెట్ కమిటీల 'జమ నిధి' నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను నిధులు మళ్లించారు. హైదరాబాద్ నగరంలోని గడ్డిఅన్నారం మార్కెట్‌ను కోహెడకు తరలించి ప్రపంచ స్థాయి మోడల్ మార్కెట్‌గా నిర్మిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఇందుకు గాను మొదటి దశ పనులు చేపట్టేందుకు రుణ ప్రాతిపదికన ఈ నిధులు బదిలీ చేయడం గమనార్హం. నిధులను బదలాయించేందుకు ఎంపిక చేసిన సదరు 70 మార్కెట్లకు సంబంధించి మొత్తం రూ. 701 కోట్ల 12 లక్షల 87 వేలు ఉన్నాయి. ఈ నిధుల నుంచి రూ. 350కోట్లు తీసుకున్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి..

ఇదిలా ఉండగా ఆయా మార్కెట్ల అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటికే పెట్టుకున్న ప్రతిపాదనలు మాత్రం పెండింగ్‌లో ఉండడం విశేషం. నిజామాబాద్ మార్కెట్ కమిటీ యార్డులో రూ. 3.5కోట్లతో కవర్ షెడ్ నిర్మించేందుకు గాను పెట్టిన ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి అనుమతులు ఇప్పటివరకు రాలేదు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 8 మార్కెట్ కమిటీల నుంచి కోహెడ మార్కెట్‌కు రూ. 32కోట్లు తీసుకున్నారు. ఇదిలా ఉండగా గతంలోనూ నిజామాబాద్ మార్కెట్ కమిటీ నుంచి మరో రూ. 7కోట్లు ఇతర జిల్లాల మార్కెట్లకు తరలించుకుపోవడం గమనార్హం. వనపర్తి మార్కెట్‌కు రూ. 4కోట్లు, గజ్వేల్ సమీపంలోని ఒంటిమామిడి మార్కెట్‌కు రూ. 3కోట్లు తరలించుకుపోవడం గమనార్హం. కాగా ప్రస్తుతం కోహెడ మార్కెట్‌కు నిజామాబాద్ మార్కెట్ నుంచి రూ. 8కోట్లు బదలాయించారు. కాగా ఐదేళ్లుగా నిజామాబాద్ మార్కెట్ కమిటీకి చైర్మన్‌ను నియమించకపోవడం విశేషం.

ఉమ్మడి జిల్లాల్లోని మార్కెట్ల నుంచి కేటాయించిన నిధులు (రూ.లక్షల్లో)

జిల్లా	మార్కెట్ కమిటీల్లోని నిధులు	కోహెడకు కేటాయింపు
నిజామాబాద్	4681.52	2000.00
కామారెడ్డి	2380.17	1200.00

మార్కెట్ కమిటీల నుంచి కేటాయించిన నిధులు

మార్కెట్ (రూ.కోట్లలో)		మార్కెట్ (రూ.కోట్లలో)	
నిజామాబాద్	8	కమ్మర్‌పల్లి	4
బోధన్	3	మద్నూర్	3
ఆర్మూర్	2	జుక్కల్	4
వర్ని	3	ఎల్లారెడ్డి	5

ఎస్సారెస్పీకి తరలివస్తున్న రైతులు



ముప్కాల్ వద్ద కాళేశ్వరం నీళ్లను తిలకించేందుకు వచ్చిన రైతులు

- కాళేశ్వరం నీళ్లను తిలకిస్తున్న అన్నదాతలు
- క్లస్టర్ వారీగా సందర్శన
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన మంత్రి ప్రశాంత్‌రెడ్డి
- ప్రతిరోజూ 500 మందికి భోజన సౌకర్యం

బాల్కొండ: ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ద్వారా కాళేశ్వరం నీళ్లను శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి రివర్స్ పంపింగ్ చేస్తుండడంతో రైతులు సందర్శిస్తున్నారు. ఎక్కడో 300 కిలోమీటర్ల నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా వరద కాలువ గుండా ప్రాజెక్టులోకి నీరు ఎలా ప్రవహిస్తుందో రైతులు తెలుసుకోవాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రైతుల సందర్శన కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీంతో ప్రతిరోజూ నియోజకవర్గంలోని రైతు వేదిక క్లస్టర్‌ల వారీగా రైతులు ముప్కాల్ శివారులోని ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం మూడో పంప్‌హౌజ్ వద్ద పరిశీలిస్తారు. ప్రతిరోజూ 500 మంది రైతులు సందర్శిస్తారని అంచనా వేసుకుని ఏర్పాట్లను చేస్తున్నారు. రైతులు ఒక్కపూట భోజనం కూడా మంత్రి ఏర్పాటు చేశారు. రైతులకు వివరించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. రైతులు లోపలికి వెళ్లకుండా వీఆర్‌ఏలు బాధ్యత తీసుకుని రక్షణగా ఉంటున్నారు. పంపుహౌజ్‌ల ద్వారా నీరు ఎలా వస్తుందో చూపించడానికి రైతులను బస్సుల్లో తీసుకువస్తున్నారు. పంప్‌హౌజ్‌లతో పాటు ప్రాజెక్టును కూడా రైతులు తిలకించి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతులతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు సందడిగా మారింది. సుమారు నెలరోజుల పాటు రైతుల సందర్శన ఉంటుందని బీఆర్‌ఎస్ ముప్కాల్ మండలాధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికకు తలుపులు తెరిచే ఉంటాయ్

- ఎవరికీ టికెట్ల హామీ లేదు
- సర్వేలే ప్రామాణికం
- టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



మాట్లాడుతున్న మహేశ్‌కుమార్ గౌడ్

ఖలీల్‌వాడి: కాంగ్రెస్‌లో చేరే వారికి తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమించిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులకు మహేశ్‌కుమార్ గౌడ్ నియామకపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి ఎవరికీ టిక్కెట్ల హామీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ చేయిస్తున్న సర్వేలే ప్రామాణికమన్నారు. కాంగ్రెస్ నేతలు ప్రజల్లోకి వెళ్లి ప్రజాసమస్యలపై స్పందించాలని, కష్టపడిన వారికి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. మండల, బ్లాక్ స్థాయి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి వెన్నుముకలాంటివారన్నారు. ప్రతి కార్యకర్త నుంచి జిల్లా స్థాయి నాయకుడి వరకు ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి నిబద్ధతతో కష్టపడి పనిచేయాలని కోరారు. బీఆర్‌ఎస్, బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నిజామాబాద్ రూరల్ ఇన్‌చార్జి భూపతిరెడ్డి, బాన్సువాడ ఇన్‌చార్జి కాసుల బాలరాజు, నిజామాబాద్ అర్బన్ ఇన్‌చార్జి తాహెర్‌బిన్‌హందాన్, పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్, జిల్లా కిసాన్ కేత్ అధ్యక్షుడు ముప్పా గంగారెడ్డి, నేతలు శేఖర్ గౌడ్, విక్కీ యాదవ్, వేణురాజ్, భాగ్య, నరేందర్ గౌడ్, లింగం, సంతోష్, ప్రీతం, నాగరాజ్ పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌లో వస్తే కేసులే..!

- జిల్లాలో 110 కేసుల నమోదు
- ప్రమాదాలు నివారించేందుకు పోలీసుల ప్రయత్నం
- ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాలతో..

ఖలీల్‌వాడి : వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ వంటి ప్రాంతాల్లో రాంగ్‌రూట్‌లో ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గుర్తించిన ఎక్కువ చోటు చేసేకుంటున్నాయి. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది, కళాజాత బృందాల ద్వారా అవగహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. అయినా వాహనాదారులు రాంగ్‌రూట్‌లో ప్రయాణం చేయడంతో వారి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాల మీదికి వస్తున్నాయి. కొందరు వాహనాదారులు క్షతగ్రాత్రులుగా మారిన ఘటనలు ఉన్నాయి. రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాదారులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు.

కమిషనరేట్ పరిధిలో..

రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాలను పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ వంటి ప్రాంతాల్లో పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో అత్యధికంగా ట్రాఫిక్ పోలీసులు ఎక్కువగా కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లా కేంద్రానికి అత్యధికంగా ఇతర ప్రాంతాల నుంచి వాహనాల ద్వారా వస్తుంటారు. నగరంలో విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, తదితరులు తమ పనుల నిమిత్తం వాహనాలపై వెళ్తుంటారు. జిల్లాలో వివిధ రకాల వాహనాలు 4,82,962 ఉన్నాయి. నగరంలో రాంగ్‌రూట్‌లో వెళ్లి ప్రతిరోజు యాక్సిడెంట్ ఘటన జరుగుతుంది. దీనిని కట్టడి చేయడానికి జిల్లా కేంద్రంలో 90 వరకు రాంగ్‌రూట్‌లో వెళ్లిన వాహనాదారులపై కేసులు నమోదు చేయగా ఆర్మూర్, బోధన్ ప్రాంతాలలో 30వరకు కేసులు నమోదు చేశారు.

గతంలో అనేక ఘటనలు

నగరంలో రోడ్లపైన షాప్ ఎదుట వాహనాలను నిలిపేయడంతో రోడ్డు ఇరుకుగా మారడంతో రాంగ్‌రూట్‌లో వచ్చినవారు, రైట్‌రూట్‌లో వచ్చిన వారు అకస్మత్తుగా యాక్సిడెంట్‌లు జరగడంతో ఆసుపత్రుల పాలైన ఘటనలు ఉన్నాయి. అక్కడిక్కడే మృతి చెందిన ఘటనలు, క్షతగాత్రులుగా మారిన ఘటనలు ఉన్నాయి. ప్రమాదాలు నివారించడానికి పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు పకడ్బందీగా రాంగ్‌రూట్ కేసులను నమోదు చేస్తున్నారు. ప్రమాదాలను నివారించడంతోపాటు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెరుగుతుందనే ఉద్దేశంతోనే కేసులు నమోదు చేస్తున్నట్లు పోలీసులు అంటున్నారు.

- రెండు నెలల క్రితం భార్యభర్తలు ఏసీపీ కార్యాలయంలో కుటుంబ సమస్యపై ఫిర్యాదు ఇచ్చి వెళ్తుండగా రాంగ్‌రూట్‌లో వచ్చిన బుల్లెట్ వాహనం ఎక్సెల్ వాహనాన్ని ఢీకొనడంతో భర్త మృతి చెందగా భార్యకు గాయాలయ్యాయి.

- నగరంలోని ఒకటో టౌన్ పరిధిలోని గాంధీ చౌక్ నుంచి ఢిల్లీవాలా స్వీట్‌హోమ్‌కు వెళ్లే దారిలో రాంగ్‌రూట్‌లో వస్తున్న బైక్ ఢీకొని మరొక బైక్‌పై ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. కొద్దిసేపు అక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.



నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో వాహనాదారులకు, ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. రాంగ్‌రూట్‌లో వస్తే ఇద్దరికి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కాబట్టి వాహనాదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. ఇన్‌ఛార్జీ పోలీస్‌కమిషనర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు రాంగ్‌రూట్ కేసులు నమోదు చేస్తున్నాం.

– చందర్‌రాథోడ్, ట్రాఫిక్ సీఐ, నిజామాబాద్

12న జిల్లాకు రానున్న కేంద్ర బృందం

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగర పాలక సంస్థలో ఓటర్ల జాబితాను పరిశీలించడానికి ఈ నెల 12న కేంద్ర బృందం జిల్లాకు రానుంది. నగరంలో ఓటర్ల ప్రక్రియ ఏ విధంగా చేపట్టారు, మరణించిన ఓటర్ల తొలగింపు, కొత్త ఓటర్లు, డబుల్ ఓటర్ల ఏరివేత తదితర వాటిపై కార్యాలయంలో పరిశీలిస్తారు. అలాగే నగరంలోని డివిజన్లలో క్షేత్రస్థాయిలోకి వెళ్లి పర్యటిస్తారు. ఇప్పటికే మున్సిపల్ అధికారులు ఓటర్ల జాబితాపై కసరత్తు చేస్తున్నారు. కేంద్ర బృందం వస్తున్న నేపథ్యంలో కమిషనర్ చిత్రామిశ్రా మూడు, నాలుగు రోజుల నుంచి కార్యాలయంలో ప్రత్యేకంగా ఓటర్ల జాబితా పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు ఇస్తున్నారు.

నగరంలో భారీ వర్షం

నిజామాబాద్‌అర్బన్: నగరంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 8 గంటల సమయంలో సుమారు 45 నిమిషాల పాటు వాన పడింది. దీంతో రోడ్లన్నీ జలమయంగా మారాయి. కంఠేశ్వర్ ప్రాంతంలో బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు వచ్చి చేరింది. డ్రెయినేజీల్లో వాననీటితో ఉప్పొంగాయి. ఈ ఏడాది వర్షాకాలంలో ఇదే భారీ వర్షం కావడం విశేషం.



నగరంలో కురుస్తున్న వర్షం

క్లుప్తంగా

హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లోని హాస్టళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని రిజిస్ట్రార్‌ ఎం యాదగిరి ఆదేశించారు. సోమవారం క్యాంపస్‌లోని బాలుర (ఓల్డ్, న్యూ), బాలికల హాస్టళ్లను ఆయన తనిఖీ చేశారు. అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కార మార్గాలను సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, వంటగదుల్లో శుభ్రత పాటించాలని సూచించారు. హాస్టల్స్‌ చీఫ్‌ వార్డెన్‌ మహేందర్, అసిస్టెంట్‌ ఇంజినీర్‌ వినోద్‌కుమార్, ఎస్టేట్‌ ఆఫీసర్స్‌ అశోక్‌ వర్ధన్‌రెడ్డి, యాదగిరి, అసిస్టెంట్‌ వార్డెన్స్‌ కిరణ్‌ రాథోడ్, రాజేశ్వరి, కేర్‌టేకర్స్‌ క్రాంతి, దిగంబర్‌ చౌహాన్, రమేష్, పీరుబాయి ఉన్నారు.

నేటి నుంచి డిగ్రీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 2వ, 4వ, 6వ సెమిస్టర్‌ రెగ్యులర్,1వ,3వ,5వ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌ పరీక్షలు మంగళవారం (జూలై 11) నుంచి ప్రారంభమవుతాయని వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు,విద్యార్థులు ఈవిషయాన్నిగమనించాలనిసూచించారు.

ఆస్పత్రి స్థలం కబ్జాపై ఫిర్యాదు



నవీపేట:మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి (సీహెచ్‌సీ) స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సోమవారం రెవెన్యూ, పోలీస్‌ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఖాళీగా ఉన్న ఆస్పత్రి స్థలాన్ని దర్జాగా కబ్జా చేసి రేకుల షెడ్డు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్‌ ఆఫీసర్‌ సామ్రాట్‌ యాదవ్, సూపర్‌వైజర్‌లు కిషన్, దేవేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పబ్బు తగలబెడుతుండగా ఫిట్స్‌

- మంటల్లో పడి యువకుడికి తీవ్రగాయాలు

మాచారెడ్డి: ఇంటి ముందు వేసిన పందిరి పబ్బు(కొమ్మలు, ఆకులు) తగల బెడుతుండగా.. ఫిట్స్‌ వచ్చి మంటల్లో పడి ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం పాల్వంచ మండల కేంద్రంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన తోట నరేష్‌ కుటుంబ సభ్యులు ఇటీవల నూతన గృహ ప్రవేశం చేశారు. ఇంటి ముందు వేసిన పందిరి పబ్బు తగుల బెడుతుండగా నరేష్‌కు ఫిట్స్‌ వచ్చి ఆ మంటల్లో పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

మ్యుటేషన్‌ తిప్పలు!

- రిజిస్ట్రేషన్, మున్సిపల్‌ శాఖల సమన్వయ లోపం..
- ఇళ్ల నంబర్ల కేటాయింపులో గందరగోళం
- సరిచేయాలని బల్దియా కార్యాలయానికి పరుగులు తీస్తున్న ప్రజలు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఓ అపార్టుమెంట్‌లో రాజన్న(పేరు మార్చాం) అనే వ్యక్తి ఫ్లాట్‌ కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్‌ చేసుకున్నాడు. మ్యుటేషన్‌ చేసిన రిజిస్ట్రేషన్‌ శాఖ అధికారులు ఇంటి నంబర్‌ కేటాయించారు. రాజన్న కొనుగోలు చేసిన ఫ్లాట్‌ ప్రాంతానికి సంబంధం లేకుండా ఇంటి నంబర్‌ కేటాయించారు. దీంతో సదరు వ్యక్తి డాక్యుమెంట్‌ పట్టుకొని మున్సిపల్‌ అధికారుల వద్దకు పరుగులు తీశాడు. వారు తమ చేతుల్లో ఏమీ లేదని చేతులెత్తేశారు.

సుధాకర్‌ (పేరు మార్చాం) ఆర్యనగర్‌లో ఇల్లు కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్‌ శాఖ అధికారులు మ్యుటేషన్‌ చేసి ఇంటి నంబర్‌ కేటాయించారు. తను కొనుగోలు చేసిన ప్రాంతానికి ఇచ్చిన ఇంటి నంబర్‌కు పొంతన లేకుండా పోయింది. దీంతో సుధాకర్‌ రిజిస్ట్రేషన్‌ కాగితాలు పట్టుకొని మళ్లీ మున్సిపల్‌ కార్యాలయానికి పరుగులు పెట్టాడు. ఇలా చాలా మంది తమ ఇంటినంబర్ల విషయంలో జరిగిన గందరగోళంతో ఇబ్బందులు పడుతున్నారు.

కొత్త ఇల్లు కొన్నా.. అపార్టుమెంట్‌లో ఫ్లాట్‌ కొనుగులు చేసినా కచ్చితంగా మ్యుటేషన్‌తో పాటు ఇంటి నంబర్‌ కేటాయించాల్సిందే. గతంలో మున్సిపాలిటీ నుంచే మ్యుటేషన్‌తో పాటు ఇంటి నంబర్‌ కేటాయించేవారు. గతేడాదిగా రిజిస్ట్రేషన్‌ శాఖ ద్వారా మ్యుటేషన్, ఇంటి నంబర్‌ కేటాయిస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ఇంటి నంబర్‌ ఎక్కడుందో తెలుసుకోవడానికి నానా తిప్పలు పడుతున్నారు. గత ఏడాది నుంచి ఇలాంటి సమస్యతో సుమారు 300వరకు దరఖాస్తులు మున్సిపల్‌లో పెండింగ్‌లో ఉన్నాయి.

నిజామాబాద్‌ కార్పొరేషన్‌ పరిధిలో 60 డివిజన్లున్నాయి. 3.99లక్షల జనాభా ఉంది. నగరంలో కొత్తగా ఇళ్లు, ప్లాట్లు, భూములు కొనుగోలు ప్రక్రియ నిరంతరం కొనసాగుతునే ఉంది. ఇల్లు, ఫ్లాట్లు కొనుగోలు చేసిన సమయంలో మ్యుటేషన్, ఇంటి నంబర్‌ కేటాయించడం చేస్తారు. గత జూన్‌ నుంచి మున్సిపాలిటీకి సంబంధం లేకుండానే రిజిస్ట్రేషన్‌ శాఖ అధికారులు మ్యుటేషన్, ఇంటి నంబర్‌ కేటాయిస్తున్నారు. అయితే మున్సిపల్, రిజిస్ట్రేషన్‌ శాఖల మధ్య సమన్వయ లోపంతో లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారు. మున్సిపల్‌ అధికారులు ఏరియాను బట్టి ఇంటి నంబర్లు కేటాయిస్తారు. రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు ఏరియా, ప్రాంతం ఏదీ అని సంబంధం లేకుండా నంబర్లు కేటాయించడంతో గందరగోళం నెలకొంది. ఈ రెండు శాఖల మధ్య సమన్వయం లేక లబ్ధిదారులు ఆఫీసుల చట్టు తిరుగుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..

రిజిస్ట్రేషన్‌ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మ్యుటేషన్, ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారు. తీరా ఇంటి నంబర్‌కు, ఏరియాకు సంబంధం లేకపోవడంతో మున్సిపల్‌ కార్యాలయానికి దరఖాస్తులు పెట్టుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మేము పని చేస్తున్నాం. – నరేందర్, ఆర్‌వో

పెద్ద చెరువు కబ్జాలను అడ్డుకోవాలి



కలెక్టరేట్‌కు తరలివచ్చిన చెరువు ఆయకట్టు రైతులు

సుభాష్‌నగర్‌: నిజామాబాద్‌ రూరల్‌ మండలంలోని గుండారం పెద్ద చెరువులో ఆక్రమణలను అడ్డుకోవాలని గుండారం, మల్కాపూర్, లక్ష్మాపూర్, అనంతగిరి, జలాల్‌పూర్, శ్రీనగర్‌ గ్రామాల రైతులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌కు ఫిర్యాదుచేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ గుండారం పెద్ద చెరువును కొంతమంది రైతులు ఆక్రమించుకుని వరి నాట్లు వేస్తున్నారని తెలిపారు. అంతేగాకుండా పెద్ద మోటార్లు బిగించుకుని నీటిని వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. సుమారు 30 ఎకరాలకుపైనే చెరువు ఆక్రమణకు గురైందని, ఈవిషయాన్ని చెరువు ఆయకట్టు ఉన్న ఏడు గ్రామాల రైతులందరం చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు ఆక్రమణకు గురైన భూమిని గుర్తించి విచారణ చేపట్టాలని, చెరువు భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

బతుకు చిత్రం



తీగపై ఒంటికాలిపై నిల్చొని విన్యాసం చేస్తున్న యువతి

బీబీపేట: పొట్ట కూటి కోసం ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా ఓ యువతి విన్యాసాలు చేసింది. బీబీపేటలో ఆదివారం రాత్రి కొందరు సర్కస్‌ ఫీట్లు వేశారు. యువతి సాహసోపేత విన్యాసాలతో ఆకట్టుకుంది. తీగపై ఒంటి కాలితో నడిచి ఆశ్చర్యపరిచింది.

గుండెపోటుతో తహసీల్దార్‌ మృతి



రమేష్‌ (ఫైల్‌)

సుభాష్‌నగర్‌: కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న తహసీల్దార్‌ ఎం రమేష్‌ (42) నగరంలోని కంఠేశ్వర్‌ బైపాస్‌ రోడ్‌లోగల తన నివాసంలో సోమవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. సిద్దిపేట సొంత జిల్లా అయినప్పటికీ రమేష్‌ ఇక్కడే స్థిరపడ్డారు. సౌమ్యుడు, వివాదరహితుడని రమేష్‌కు రెవెన్యూశాఖలో పేరుంది. గతంలో ఇందల్వాయి, పోతంగల్‌ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారు. ఇందల్వాయిలో ఉన్నప్పుడు ఆయనపై ఏసీబీ అధికారులు దాడిచేశారు. ఆ సమయంలో రమేష్‌ను కలెక్టరేట్‌కు అటాచ్‌ చేశారు. అనంతరం నూతనంగా ఏర్పడిన పోతంగల్‌ మండలానికి తహసీల్దార్‌గా వెళ్లారు. అక్కడ విధుల్లో ఉన్నప్పుడే ఇందల్వాయి ఘటనలో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇటీవల కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరారు. కాగా రమేష్‌ మృతి పట్ల కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు సంతాపం ప్రకటించారు. అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్, రెవెన్యూ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు రమణ్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు రమేష్‌ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సీజ్‌ చేసిన ఇసుకకు వేలం

సిరికొండ: మండలంలోని మైలారం గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న ఫంక్షన్‌ హాల్‌ వద్ద సీజ్‌ చేసిన ఇసుకకు సోమవారం వేలం పాట నిర్వహించినట్లు తహసీల్దార్‌ గఫార్‌మియా తెలిపారు. సుమారు పది ట్రాక్టర్ల ఇసుకకు వేలం పాట నిర్వహించగా ఇద్దరు వ్యక్తులు పాల్గొన్నారని తెలిపారు. రావుట్ల గంగాధర్‌ అనే వ్యక్తి అధికంగా వేలం పాడగా రూ. 15 వేలకు అతనికి ఇసుకను కేటాయించినట్లు చెప్పారు. వేలం పాట డబ్బులను తహసీల్దార్‌ వాల్టా ఖాతాలో జమ చేశామన్నారు.

క్రైం కార్నర్‌

లిఫ్ట్‌ గుంతలో పడి ఒకరి మృతి



దత్తాత్రి మృతదేహం

కామారెడ్డి క్రైం: లిఫ్ట్‌ గుంతలో పడి ఒకరు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని దర్శన్‌ థియేటర్‌ పక్కన నిర్మాణంలో ఉన్న ఓ భవనం వద్ద సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపల్‌ పరిధిలోని దేవునిపల్లిలో నివాసం ఉండే లింగంపల్లి దత్తాత్రి (39) మేస్త్రి పని చేసేవాడు. అతనికి భార్య లలిత కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. దర్శన్‌ టాకీస్‌ పక్కన ఓ భవన నిర్మాణం జరుగుతుంది. అందులో లిఫ్ట్‌ ఏర్పాటు చేయాల్సిన స్థలంలో గుంత తీసి ఉంది. సోమవారం ఉదయం ఒక వ్యక్తి లిఫ్ట్‌ గుంతలో పడి మృతి చెంది ఉన్నట్లు స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ ఎస్‌హెచ్‌ఓ నరేష్‌ సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. మృతుడిని దేవునిపల్లికి చెందిన దత్తాత్రిగా గుర్తించారు. మద్యం మత్తులో గుంతలో పడి బలమైన గాయాలు తగలడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మెట్లపై నుంచి జారి పడి ఒకరు..

కామారెడ్డి క్రైం: నిద్ర మత్తులో మెట్లపై నుంచి జారి పడి ఒకరు మృతి చెందారు. ఎల్లారెడ్డి మండలం బొల్లారం గ్రామానికి చెందిన బాల కిష్టయ్య (26) కూలీ పనులు చేసుకుంటూ కొద్దిరోజులుగా కామారెడ్డిలోని అశోక్‌నగర్‌ కాలనీలో భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. రోజూ మాదిరిగానే ఆదివారం రాత్రి పడుకున్నారు. అర్ధరాత్రి లేచి వెలుగుతున్న లైట్లు ఆఫ్‌ చేయబోయాడు. నిద్రమత్తులో మెట్లపై జారిపడి తలకు తీవ్ర గాయాలు కాగా అతడిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆదివారం మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తీసుకు వెళ్తుండగా చనిపోయాడు. అతని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో నరేష్‌ తెలిపారు.

పాటు కాటుతో రైతు..

భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన ఒక రైతు పాముకాటుతో మృతి చెందినట్లు ఎస్సై గాంధీగౌడ్‌ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన నారిగల్ల శంకర్‌(59) ఆదివారం సాయంత్రం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి అక్కడ పనులు చేసుకుని రాత్రి ఇంటికి వచ్చాడు. తనకు ఆగం ఆగం అవుతుందని ఇంట్లో భార్య లలితకు చెప్పి నురుగులు కక్కుతూ కింద పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

రామారెడ్డి: రామారెడ్డి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అప్పుల బాధ, అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అనిల్‌ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన పురిమిశెట్టి లక్ష్మీనారాయణ (57) వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. కొన్ని రోజుల ఆయన ఎడమ కాలుకు దెబ్బ తగిలింది. ఏడాది క్రితం ఆయన కొత్తగా ఇల్లు నిర్మించాడు. ఇంటికి చేసిన అప్పులు ఎక్కువ కావడం, పనులు చేసుకోవడానికి కాలు సహకరించకపోవడంతో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య అంజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న నలుగురిపై కేసు

ఎల్లారెడ్డిరూరల్‌: ఎల్లారెడ్డి శివారులోని జీవదాన్‌ పాఠశాల వెనకాల గల అటవీ ప్రాంతంలో పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై గణేశ్‌ సోమవారం తెలిపారు. వారి నుంచి రూ.1700 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఎడపల్లిలో చోరీ

ఎడపల్లి: ఎడపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు సర్పంచ్‌ ఆకుల మాధవి శ్రీనివాస్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యాలయంలో మూడు బీరువాలను పగులగొట్టి పరికరాలు, సామగ్రి రూ.10 వేల విలువైన వస్తువులు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ఎడపల్లి గ్రామానికి చెందిన కళా రాజు అనే వ్యక్తి ఇంట్లో సైతం చోరీ జరిగింది. రెండున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు కళా రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండు కేజ్‌వీల్‌ ట్రాక్టర్ల సీజ్‌

వేల్పూర్‌: మండలంలోని వెంకటాపూర్, కొత్తపల్లి గ్రామాలకు చెందిన రెండు కేజ్‌వీల్‌ ట్రాక్టర్లను సోమవారం సీజ్‌ చేసినట్లు ఎస్సై వినయ్‌కుమార్‌ తెలిపారు. కేజ్‌వీల్‌ ట్రాక్టర్లను తారురోడ్లపై నడపడం చట్టరీత్యా నేరమని, అలా నడిపితే సీజ్‌ చేస్తామని హెచ్చరించారు.

ప్రజావాణికి 215 ఫిర్యాదులు



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌

సుభాష్‌నగర్‌: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఏకంగా 215 మంది సమస్యలతో కూడిన వినతులను అందజేశారు. కాగా పోడు భూముల పైనే అత్యధికంగా వినతిపత్రాలు వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. గిరిజనులు అనేకమంది కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కాగా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌ సూచించారు. అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్, డీఆర్డీవో చందర్, మెప్మా పీడీ రాములు, డీపీవో జయసుధ వినతులు స్వీకరించారు.

చిట్టీ డబ్బులు ఇప్పించాలని వినతి

నగరంలోని ఓ చిట్‌ఫండ్‌ కంపెనీ నుంచి రావాల్సిన చిట్టీ డబ్బులు ఇప్పించాలని కోరుతూ పలువురు బాధితులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు. బాధితులు మాట్లాడుతూ ప్రముఖ చిట్‌ఫండ్‌ కంపెనీలో చిట్టీలు వేసి మోసపోయామని, తమకు రూ.15లక్షల వరకు రావాల్సి ఉందని వాపోయారు. చిట్టీ ముగిసినా.. డబ్బులు ఇవ్వకుండా చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. ఖాతాలో డబ్బుల్లేక చెక్కులు బౌన్స్‌ అయ్యాయని, వెంటనే ఇప్పించాలని కోరారు.

కాళేశ్వరం నీటితో ఆశలు

- సాగుకు ఢోకా లేదంటున్న ఆయకట్టు రైతులు



కొత్తపల్లిలో వరి నారు పోస్తున్న రైతులు

బాల్కొండ: కాళేశ్వరం నుంచి నీళ్లు శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతుండటంతో ఆయకట్టు రైతుల ఆశలు రెట్టింపయ్యాయి. వానాకాలం సీజన్‌ ప్రారంభమై నెల దాటినా భారీ వర్షాలు లేకపోవడం, ప్రాజెక్ట్‌లోకి వరదలు రాకపోవడంతో ఆయకట్టు రైతుల ఆశలు సన్నగిల్లుతు వచ్చాయి. కానీ శుక్రవారం నుంచి ప్రాజెక్ట్‌లోకి కాళేశ్వరం నీళ్లు రివర్స్‌ పంపింగ్‌ ద్వారా వచ్చి చేరుతుండటంతో ఒక్క పంటకైన నీరు అందుతుందని రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 22 టీఎంసీల నీరు ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి అడపదడప వరదలు వచ్చే అవకాశం ఉంది. వరదలు రాకున్న కాళేశ్వరం నుంచి 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసేల ప్రభుత్వం అడుగులు వేస్తుంది. దీంతో వానాకాలం పంటలకు డోకా ఉండదని లక్ష్మి కాలువ ఆయకట్టు రైతులు వరి నారు మడులను సిద్ధం చేస్తున్నారు.

లక్ష్మీ ప్రధాన కాలువ కింద 50 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వానాకాలంలో లక్ష్మి ఆయకట్టుకు 2 టీఎంసీల నీరు సరిపోతుంది.

ఇది వరకే నీటి విడుదల

లక్ష్మి కాలువ ద్వారా అధికారులు నీటి విడుదలను ప్రారంభించారు. లక్ష్మి కాలువ డీ–4 ఆధారంగా నిర్మించిన చౌటుపల్లి హన్మంతు రెడ్డి ఎత్తిపోతల పథకానికి నీరు అందించాలని నీటి విడుదలను చేపట్టారు. కాళేశ్వరం నీళ్లు వస్తుండటంతో ఆయకట్టుకు కూడా నీటి సరఫర అలానే జరుగుతుందని రైతులు ఆశతో సాగుకు సన్నద్ధమవుతున్నారు.

భరోసా వచ్చింది



కాళేశ్వరం నీళ్లు ప్రాజెక్ట్‌లోకి వచ్చి పడుతుండటంతో ఆయకట్టుకు నీరు అందుతుందని భరోసా వచ్చింది. మీదికెళ్లి నీళ్లు రానప్పుడు కాళేశ్వరం నీళ్లు పంటలను కాపాడుతాయి. పంటలు ఎండిపోవనే భరోసా కలిగింది. – లింగన్న, రైతు, బుస్సాపూర్‌

నారు పోసుకుంటున్నాం



కాళేశ్వరం నీళ్లు వచ్చినప్పటి నుంచి ఎటెలైన కాలువల ద్వారా నీళ్లు వదులుతారని నారు పోసుకుంటున్నాం. మరో 20 రోజులు వరకు ప్రాజెక్ట్‌కు మీది నుంచి కొన్ని నీళ్లు వచ్చిన పంటలకు సరిపోతాయి. – సాయన్న, రైతు, బుస్సాపూర్‌

ప్రాజెక్టులను అప్‌లోడ్‌ చేయండి



మాట్లాడుతున్న గంగాకిషన్‌

నిజామాబాద్‌అర్బన్‌: ప్రాథమిక, ఉన్నత పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులను ఈ నెల 25లోపు అప్‌లోడ్‌ చేయాలని జిల్లా సైన్స్‌ అధికారి గంగాకిషన్‌ అన్నారు. సోమవారం నిజామాబాద్‌ డివిజన్‌లోని సైన్స్‌ ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ.. రెండు ప్రాజెక్టులు బయోసైన్స్, రెండు ప్రాజెక్టు ఫిజికల్స్‌ సైన్స్‌ టీచర్లు, ఒక ప్రాజెక్టు గణితం ఉపాధ్యాయుడు గైడ్‌ టీచర్లుగా ఉండి ప్రాజెక్టులను రూపొందించలన్నారు. విద్యార్థులకు ఐడియా బాక్సులను ఏర్పాటుచేసి పోటీలను నిర్వహించాలన్నారు. ప్రైవేట్‌ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కూడా తప్పనిసరిగా నామినేషన్లు పూర్తి చేయలన్నారు.

యువకుల కిడ్నాప్‌ కలకలం

- రెండు రోజుల పాటు ఫామ్‌హౌస్‌లో బంధించిన వైనం
- బంధువులకు తెలియడంతో విడుదల



మీడియాతో మాట్లాడుతున్న జావెద్, సుమేర్‌

కామారెడ్డి క్రైం: ట్రేడింగ్‌ వ్యాపారం పేరుతో డబ్బులు వసూలు చేసి ఉడాయించిన ఓ యువకుడి అడ్రస్‌ కోసం అతడి ఇద్దరు స్నేహితులను కిడ్నాప్‌ చేసి ఓ ఫామ్‌ హౌస్‌లో బంధించిన ఘటన కామారెడ్డిలో సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లా కేంద్రానికి చెందిన లుక్మాన్‌ అనే యువకుడు ట్రేడింగ్‌ బిజినెస్‌ చేసేవాడు. తన ట్రేడింగ్‌ వ్యాపారంలో దాదాపు 20 నుంచి 30 మంది ద్వారా రూ.కోటిన్నర వరకు పెట్టుబడులు పెట్టించాడు. కొద్ది రోజుల తర్వాత డబ్బుతో పరారయ్యాడు. అప్పటి నుంచి తమ డబ్బులు రాబట్టుకునేందుకు బాధితులు చాలా చోట్ల గాలించడం మొదలుపెట్టారు. కామారెడ్డిలోని సైలానీబాబా కాలనీకి చెందిన సయ్యద్‌ జావేద్, ఇస్లాంపుర కాలనీకి చెందిన సుమేర్‌ హైద్రాబాద్‌ రామంతపూర్‌లో నివాసం ఉంటూ బుల్లెట్‌ షోరూంలో సేల్స్‌ ఎక్జిక్యూటివ్‌లుగా పని చేస్తున్నారు. లుక్మాన్‌ వారి గదిలో ఉంటూ కామారెడ్డికి వచ్చి వెళ్లేవాడు. అక్కడ నుంచే వ్యాపార వ్యవహారాలు చూసుకునేవాడు. పది రోజుల క్రితం నుంచి లుక్మాన్‌ కనిపించక పోవడంతో అతని తండ్రి మజార్‌ హైదరాబాదు వెళ్లి ఉప్పల్‌ పోలీస్‌ స్టేషన్‌లో అతని ఆచూకీ కోసం ఫిర్యాదు చేశాడు. దీంతో అక్కడి పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. ఆ కేసు విచారణలో ఉంది. లుక్మాన్‌ నాలుగు రోజుల క్రితం జావేద్, సుమేర్‌కు ఫోన్‌ చేసి ట్రేడింగ్‌ వ్యాపారంలో నష్టాలు రావడంతో తాను ముంబైలో తలదాచుకుంటున్నానని చెప్పాడు. అదే విషయాన్ని జావెద్, సుమేర్‌ లుక్మాన్‌ తండ్రితో పాటు ఉప్పల్‌ పోలీసులకు చెప్పారు. జావేద్, సుమేర్‌తో లుక్మాన్‌ ఫోన్‌లో మాట్లాడినట్లు ఉప్పల్‌ పోలీసుల ద్వారా కామారెడ్డికి చెందిన పలువురు డబ్బులు రావాల్సిన వారు తెలుసుకున్నారు. శుక్రవారం ముగ్గురు వ్యక్తులు రామంతపూర్‌ షోరూంకు వెళ్లారు. జావేద్, సుమేర్‌ను కారులో తీసుకువచ్చి కామారెడ్డికి సమీపంలోని పొందుర్తి వద్ద ఉన్న ఓ ఫామ్‌ హౌస్‌లో బంధించారు. లుక్మాన్‌ అడ్రస్‌ చెప్పాలని, డబ్బులు తిరిగి వచ్చేదాకా ఊరుకోబోమని బెదిరిస్తూ రెండ్రోజుల పాటు చిత్రహింసలకు గురి చేసినట్లు బాధితులు చెబుతున్నారు. యువకులను ఫామ్‌హౌస్‌లో బంధించినట్లు కామారెడ్డిలోని వారి బంధువులకు తెలియడంతో ఆదివారం రాత్రి వారిని విడిచిపెట్టారు. సోమవారం బాధితులు పట్టణ పట్టణ పోలీస్‌ స్టేషన్‌కు వచ్చారు. కిడ్నాప్‌ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌హెచ్‌వో నరేష్‌ తెలిపారు.

డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో రెండు రోజుల జైలు

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. రెండు రోజుల క్రితం దేవునిపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా సరంపల్లికి చెందిన మామిండ్ల స్వామి డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. అతడిని సోమవారం కోర్టులో హాజరుపర్చారు. నిందితునికి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్‌ రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై ప్రసాద్‌ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డికి చెందిన బొజ్జ దివ్య సోమవారం ఆత్మహత్యకు యత్నించింది. గ్రామానికి చెందిన దివ్యకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమవారం ఆమె ఒంటిపై కిరోసిన్‌ పోసుకొని నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌ తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో ఆమెను గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ విషయమై ఎస్సై ఆనంద్‌గౌడ్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.